క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డిలు బాధితుల ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. పట్టణంనకు చెందిన బొగ్గుల శ్రీనివాసరెడ్డికి రూ.5 లక్షలు, పి.వెంకటాపురం గ్రామానికి చెందిన కట్టమీద శ్రీనివాసరెడ్డికి రూ.8.50 లక్షలు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ జెక్కు చెన్నకృష్ణారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు డి. సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

వేముల : మండలంలోని రాచకుంటపల్లె, మబ్బుచింతలపల్లె, వేల్పుల, పెద్దజూటూరు, భూమయ్యగారిపల్లె 33/11కె.వి విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8.15గంటల నుంచి 10.30 గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జేఈ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



యోగాసనాలపై అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

వేంపల్లె : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్వాతిసాయి సూచించారు. శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా చింతలమడుగుపల్లెలోని సచివాలయంలో తాళ్లపల్లె పీహెచ్‌సీ ఆధ్వర్యంలో యోగా, మెడిటేషన్‌పై పలు సూచనలు ఇచ్చారు. ఆరోగ్యంగా ఉండేందుకు సరైన భోజనం, వ్యాయామం, మానసిక ఒత్తిడి నివారణ తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నీషా, సీహెచ్‌ఓ వెంకటరత్నం, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంకాలమ్మ తిరునాల

పెండ్లిమర్రి : మండలంలోని రంపతాడు గ్రామంలో వెలసిన అంకాలమ్మ తిరునాల ఉత్సవాలు శుక్రవారం ఆలయ నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బండలాగుడు పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

వైభవంగా గుమ్మటం స్వామి ఉరుసు

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో గుమ్మటం స్వామి ఉరుసు మహోత్సవం రెండు రోజుల పాటు ఘనంగా జరిగింది. శుక్రవారం స్వామి వారికి గ్రామంలోని చాలామంది కందూరులు చేయించారు. సాయంత్రం స్వామి వారి దర్గాను భక్తులు సందర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి దర్గాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట శివశేఖర్‌రెడ్డి, ఎల్.శ్రీనువాసుల రెడ్డి, చెన్నారెడ్డి, వరప్రసాద్ రెడ్డి, చిన్న రాంపుల్లారెడ్డిలు పాల్గొన్నారు

బీజేపీతో పొత్తు సిగ్గు చేటు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీతో పొత్తుకు టీడీపీ ఆరాట పడుతుండడం సిగ్గుచేటని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ విమర్శించారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన అన్యాయాలు, వివక్ష పూరిత విధానాలు వ్యతిరేకంగా పోరాడాల్సింది పోయి జట్టు కట్టడానికి పోటీ పడ్డం దారుణమన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పోలవరం ప్రాజెక్టు, విశాఖ ఉక్కు పరిశ్రమ వంటి విషయాల్లో కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం పోరాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేస్తున్నా టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీ అవకాశవాద పొత్తుల కోసం ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ప్రచార యాత్రలు చేపడతామని వివరించారు.

పన్ను ఒకేసారి చెల్లిస్తే 5 శాతం తగ్గింపు

కడప కార్పొరేషన్: ఈ ఏడాది ఆర్థిక సంవత్సరానికి(2023–24) సంబంధించి ఏప్రిల్ 1వ తేది నుంచి 2024 మార్చి 31 వరకూ (రెండు అర్థ సంవత్సరాలు) పన్ను ఒకేసారి చెల్లించిన వారికి 5 శాతం తగ్గింపు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ అండ్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

ఈనెల 30లోపు చెల్లించిన వారికే ఈ తగ్గింపు వర్తిస్తుందని తెలిపారు. ఇదివరకు ఉన్న బకాయిలకు ఇది వర్తించదని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పన్నుకు మాత్రమే రిబేటు వర్తిస్తుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పన్నులను ఒకేసారి చెల్లించి తగ్గింపు పొందాలని తెలిపారు.

కార్యకర్తలే పార్టీకి బలం..

- ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంది
- ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు మనమందరం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి రోడ్డులోని రాజారాణి మహల్ ఫంక్షన్ హాల్‌లో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కమలాపురం, చింతకొమ్మదిన్నె, వల్లూరు, పెండ్లిమర్రి, చెన్నూరు, వీఎన్‌పల్లి మండలాలతో పాటు కడప అర్బన్ పరిధిలోని 85 సచివాలయాల కన్వీనర్లు, నాయకులు, గృహసారథులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మన పార్టీ అధికారంలోకి వస్తే కార్యకర్తలకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ చేసిన అరాచకాలు, మన ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించి గత ప్రభుత్వానికి మన ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు గుర్తించేలా పనిచేయాలన్నారు. అలాగే జగనన్నకు మద్దతుగా 82960 82960 నెంబర్‌కు మిస్డ్ కాల్ చేయాలన్నారు. ఏ ఒక్క కార్యకర్తను వదులుకోను అని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో ప్రతి కార్యకర్తకు త్వరలోనే మేలు జరుగుతుందన్నారు. జెసీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్ చల్లా మధుసుదన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ ప్రతి కార్యకర్తను గుర్తుంచుకుంటుందన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లి మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉంటేనే పార్టీకి ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ చైర్మన్ పులి సునీల్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్ఆర్,



సీకేదిన్నెలో జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ఎర్రగుంట్లలో జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్ల ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జెడ్పీ వైస్ చైర్మన్ పిట్టు బాలయ్యయాదవ్, మండల కన్వీనర్‌లు గూడా ప్రభాకర్‌రెడ్డి, అబ్బిరెడ్డి వీరారెడ్డి, ఉత్తమారెడ్డి, పుల్లారెడ్డి, జీఎన్ భాస్కర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, మాచునూరు చంద్రారెడ్డి, గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కో కన్వీనర్ కణాయాదవ్ కార్పొరేటర్ చంద్రహాస్‌రెడ్డి, ఏపీ ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రశాంతినగర్ సచివాలయ పరిధిలో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని శుక్రవారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వైఎస్ అభిషేక్‌రెడ్డిలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళుతూ మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను అతికిస్తూ ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, ఆలయాల చైర్మన్లు సుదీకర్‌రెడ్డి, బ్యాటరీ ప్రసాద్, కౌన్సిలర్లు కోడి రమణ, భార్గవి, కిశోర్, రాజశేఖర్, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు యార్వ వెంకటసుబ్బయ్య, సంపత్, పద్మనాభరెడ్డి, రసూల్, రంగారెడ్డి, వి జయ్, బాబు, శ్రీరాములు, డేనియల్, కోఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలసి ఇంటింటికీ వెళ్లి జగనన్న స్టిక్కర్లను అంటిస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 14 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారంను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తిప్పి కొట్టాలన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు జగనన్నే మన భవిష్యత్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎం .సురేంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, ఉపమండలాధ్యక్షుడు మల్లు మోహన్‌రెడ్డి, మార్కెట్ యార్డు వైఎస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు డి .సూర్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు ఎరికలరెడ్డి, మహమ్మద్‌అలీ, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక సచివాలయం–6 పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని శుక్రవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.చంద్రఓబుళరెడ్డి, సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మీగాయత్రిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గత ప్రభుత్వాల పాలన తీరు గురించి అవగాహన కల్పించి ఇవే అంశాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు చంద్రశేఖర్, మణిగోపాల్‌రెడ్డి, రాజ్‌కుమార్, బాబాషరీఫ్, వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పెద్దముడియంలో..

పెద్దముడియం : జగనన్నే మా భవిష్యత్, మానమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ చవ్వా కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని పెద్దపసుపుల, పెద్దముడియం, ఎస్.కొట్టాలపల్లె, చిన్న పసుపుల, నెమళ్లదిన్నె గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజలకు బుక్‌లెట్‌లు, సెల్‌ఫోన్ స్టిక్కర్లు, గృహాల స్టిక్కర్లు అందజేశారు. మార్కెట్ యార్డు చైర్మన్ పి.వి.రమణారెడ్డి, గ్యాస్ శివారెడ్డి, లక్ష్మినారాయణ రెడ్డి, శివశంకర్‌రెడ్డి, సర్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేంపల్లెలో జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న మండల కన్వీనర్, సర్పంచ్, ఎంపీపీ

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం(రేపు) ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణుడు డాక్టర్ దినేష్ కుమార్‌రెడ్డి కిడ్నీలో రాళ్లు, కిడ్నీ వాపు, కిడ్నీ గడ్డలు, కిడ్నీ అండ్ యూరిన్ ఇన్‌ఫెక్షన్, మూత్ర సమస్యలు, పోస్టేట్ గ్రంధి సమస్యలు, అంగ సమస్యలు తదితర జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కొలొనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. అలాగే ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరీక్షలు చేయించుకోవాలనుకునేవారు పడగడపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

16న పాలిసెట్, ఏపీఆర్‌జేసీ ఉచిత శిక్షణ

పులివెందుల టౌన్ : పదవ తరగతి పరీక్షల అనంతరం పాలిసెట్, ఏపీఆర్‌జేసీ–2023 ప్రవేశ పరీక్షలకు పులివెందుల పట్టణంలోని పాత సత్రంబడి పాఠశాలలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం వారి సహకారంతో ఈనెల 16వ తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు సేవాసమితి అధ్యక్షుడు రాజు తెలిపారు. శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు 10వ తరగతి హాల్ టికెట్, ఆధార్ జిరాక్స్ తీసుకుని తల్లిదండ్రులతోపాటు వచ్చి ఉచిత శిక్షణ ప్రవేశం పొందాలన్నారు. పులివెందుల ప్రాంత గ్రామీణ, పట్టణ పరిధిలోని విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9966509364, 9866727534 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

మజ్జిగ చలివేంద్రాల ఏర్పాటు హర్షణీయం

పులివెందుల టౌన్ : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేయడం హర్షణీయమని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డిలు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ (పాత బస్టాండు)లో ఉన్న బస్ షెల్టర్ వద్ద 20వ వార్డు కౌన్సిలర్ కోడి రమణ ప్రముఖ చిన్నపిల్లల డాక్టర్ దివంగత ఇసీ గంగిరెడ్డి మజ్జిగ చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

ఘనంగా కంకణ మహోత్సవం

సింహాద్రిపురం : అంకాలమ్మగూడూరులో వెలసిన అంకాలమ్మతల్లి తిరునాల సందర్భంగా గురువారం రాత్రి కంకణ దారణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి కంకణం కట్టి తిరునాలకు అంకురార్పణ చేశారు. అలాగే అంకాలమ్మతల్లి జాతర సందర్భంగా ఈనెల 16వ తేదీన ఎద్దులచే బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ అశోక్‌రెడ్డి తెలిపారు. మొదటి బహుమతి రూ.90వేలు, రెండవ రూ.80వేలు, మూడు నుంచి తొమ్మిది వరకు నగదు బహుమతులుంటాయన్నారు. మరిన్ని వివరాలకు 6309833011, 8919189323 నెంబర్లను సంప్రదించాలన్నారు.



ప్రత్యేక అలంకరణలో అంకాలమ్మతల్లి అమ్మవారు

వైఎస్ కుటుంబం చొరవతో
నూర్‌బాషా సంఘం అభివృద్ధి

పులివెందుల రూరల్ : వైఎస్ కుటుంబంతోనే రాష్ట్రంలో దూదేకుల సంఘం అభివృద్ధి చెందుతోందని నూర్‌బాషా దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక దూదేకుల సంఘ కార్యాలయంలో దూదేకుల సంఘీయులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో దూదేకుల సంఘ ఫెడరేషన్ ఏర్పాటు చేసి అభివృద్ధి చేశారన్నారు. దూదేకుల సంఘాన్ని బలోపేతం చేయడానికి సత్యసాయి జిల్లా ధర్మవరంకు చెందిన ఎస్.మహబూబ్‌బాషాను జిల్లా అధ్యక్షుడిగా నియమించడం జరిగిందన్నారు. సత్యసాయి జిల్లాలో నూర్‌బాష సంఘాన్ని బలోపేతం చేసే విధంగా చేయాలన్నారు. నూర్‌బాషా దూదేకుల సంఘాన్ని సత్యసాయి జిల్లాలో బలోపేతం చేసే విధంగా తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నూర్‌బాషా దూదేకుల సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్షరజ్ఞానంతో అభివృద్ధే లక్ష్యంగా పల్లెనిద్ర

ప్రొద్దుటూరు క్రైం : అక్షర జ్ఞానంతో అభివృద్ధే లక్ష్యంగా మాదిగల ఆత్మగౌరవ పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన ప్రొద్దుటూరుకు విచ్చేశారు. ముందుగా పాతబస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం కొర్రపాడు రోడ్డులోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో 5 రోజుల పాటు పల్లెలన్నీ పర్యటించామన్నారు. మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రతి గ్రామాన్ని తిరిగి వివరిస్తున్నామని చెప్పారు. మాదిగలు ఉన్నత శిఖరాలను చేరుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని పల్లెలను సందర్శిస్తున్నామని తెలిపారు. అనంతరం అమృతానగర్‌లోని 11వ వీధిలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు



పులివెందులలో శిలువయాగంలో రోమన్ క్యాథలిక్ పాస్టర్ ప్రకాష్, క్రైస్తవ సోదరులు



కమలాపురంలో శిలువయాగంలో పాల్గొన్న క్రైస్తవ సోదరులు



చెన్నూరులో శిలువయాగంలో పాల్గొన్న విశ్వాసులు

పులివెందుల టౌన్ : స్థానిక సీఎస్ఐ చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం పాస్టర్ రెవరెండ్ ఆనందరావు ఆధ్వర్యంలో యేసుక్రీస్తు గురించి వివరిస్తూ ప్రార్థనలు చేశారు. అలాగే పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి, రాక్‌చర్చి, బేతేలు చర్చి, సాలేము ప్రార్థనా మందిరం, క్యాథలిక్, హోసన్న తదితర ప్రార్థన మందిరాల్లో క్రైస్తవ సోదరులు, సోదరీమనులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఉపవాసదీక్షలు చేశారు. అలాగే పట్టణంలోని రోమన్ క్యాథలిక్ చర్చి పాస్టర్ ఎన్.ప్రకాష్ ఆధ్వర్యంలో శిలువయాగం నిర్వహించారు. పట్టణంలోని ముద్దనూరురోడ్డు, కచేరిరోడ్డు, పాత గంగిరెడ్డి ఆసుపత్రిరోడ్డు, పూలంగళ్ల సర్కిల్ మీదుగా శిలువయాగాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, చర్చి సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం ఆర్‌సీఎం చర్చి ప్రాంగణంలో మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప తన తండ్రి ఓబన్న జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పెద్దముడియం : మండల వ్యాప్తంగా గ్రామాలలోని చర్చిలలో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. పెద్దపసుపుల గ్రామంలోని చర్చిలో ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పాల్గొని పార్థనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం : మండలంలోని తదితర గ్రామాల్లో క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. కమలాపురంలో వెలసిన ఆర్‌సీఎం, సీఎస్ఐ, టీసీసీ టౌన్ చర్చి, రెహబోతు, మన్నా, యెరూషలేము, టౌన్ చర్చి (రాంనగర్) తదితర చర్చిలలో శుక్రవారం పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. సీఎస్ఐ చర్చి పాస్టర్ భరత్ హెరాల్డ్ ఆధ్వర్యంలో యువకులు క్రీస్తు శిలువయాగం చేశారు. అలాగే తదితర చర్చిల పాస్టర్లు కూడా శిలువయాగం చేశారు. అనంతరం క్రీస్తును స్మరించుకుంటూ గీతాలు ఆలపించారు.

చెన్నూరు : మండలంలోని వివిధ చర్చిలలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే స్థానిక చర్చిలో ఫాదర్ పీటర్ ప్రభాకర్ ఏసు ప్రభువు సందేశాన్ని వినిపించారు. అనంతరం క్రీస్తు శిలువయాగాన్ని నిర్వహించారు. క్రైస్తవ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం పట్టణంతోపాటు మండల పరిధిలోని పలు గ్రామాలలోని చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని ఎస్బీజీ క్వార్టర్‌లోని సీఎస్ఐ చర్చిలో రెవరెండ్ దేవదాస్‌బాబు మాట్లాడుతూ క్రీస్తు శిలువ వేసిన సమయంలో పలికిన మాటలను ప్రతి క్రైస్తవుడు గుర్తు పెట్టుకోవాలని తెలిపారు. అనంతరం సామూహిక సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వల్లూరు : మండలంలో క్రైస్తవులు శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా పలు గ్రామాలలోని చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పైడికాలువలోని ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ చిన్నప్ప ఆధ్వర్యంలో శిలువ మార్గం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం 49 రోజులుగా చేస్తున్న ఉపవాస దీక్షలను విరమించారు.

కమిటీలు వద్దు.. రద్దే ముద్దు

కడప ఎడ్యుకేషన్: సీపీఎస్‌పై కమిటీలు వేయకుండా రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులకు బాసటగా నిలవాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల పింఛను పథక పరిశీలన కోసం కేంద్ర ప్రభుత్వం కమిటీ వేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ పథకాన్ని అమలు చేయాల్సిందిగా కొన్నేళ్లుగా ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారన్నారు. ఉద్యోగుల కోరిక మేరకు ఇప్పటికే పలు రాష్ట్రాలు పాత పింఛన్ పథకాన్ని అమలు చేశాయని గుర్తు చేశారు.

భక్తిశ్రద్ధలతో ఇఫ్తార్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రంజాన్ ఎంతో పవిత్రమైన మాసమని డీవైఎఫ్ఐ, ఆవాజ్ నగర కార్యదర్శులుఓబులేశు, రియాజ్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సాయిపేటలోగల తిమ్మర్‌జీ మసీదులో డీవైఎఫ్ఐ,ఆవాజ్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, ఆవాజ్ నాయకులు విజయ్‌భాస్కర్, శివ, అబ్దుల్ రఫీ, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దోమతెరలు అందజేత

కడప కల్చరల్ : కడప నగరం ప్రకాశ్‌నగర్‌లోని అర్బన్ బాయిస్ హాస్టల్‌లో శుక్రవారం మోరంరెడ్డి బుచ్చిరామిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో దోమతెరలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాంఘికసంక్షేమశాఖ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య మాట్లాడుతూ బాల్యం ఆరోగ్యంగా సాగినప్పుడే వారి భవిష్యత్తు బాగుంటుందన్నారు. ప్రొద్దుటూరు జీఎస్టీ సర్కిల్–1 అసిస్టెంట్ కమిషనర్ మోరంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి వీటిని బహూకరించారు. కార్యక్రమంలో కొండూరు జనార్దన్‌రాజు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడ్డి వాములు దగ్ధం

బ్రహ్మంగారిమఠం : మండలంలోని సోమిరెడ్డిపల్లె గ్రామంలో శుక్రవారం నాలుగు గడ్డి వాములు దగ్ధం కావడంతో రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. యత్తపు వెంకటసుబ్బారెడ్డి, రమణారెడ్డి, తులసమ్మలు మాట్లాడుతూ మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా గడ్డి వాముల నుంచి దట్టమైన పొగలు రావడంతో మంటలను ఆర్పేందుకు బద్వేల్ ఫైర్ స్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. వారు వచ్చి మంటలను ఆర్పేసరికి నాలుగు గడ్డి వాములు పూర్తిగా కాలి పోయాయని తెలిపారు.

శారీరక శ్రమతోనే ఆరోగ్యం




ర్యాలీ నిర్వహిస్తున్న ఆస్పత్రి అధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : ఆహారపు అలవాట్లతో పాటు శారీరక శ్రమ చేయడం వల్ల మనం ఆరోగ్యంగా ఉండగలుగుతామని కల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి బద్వేలి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినం సందర్భంగా శుక్రవారం సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బుడ్డాయపల్లె బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యం అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి దీని ప్రాముఖ్యత గురించి వివరించాలన్నారు. అనంతరం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ అధికారి సాధు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కామనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

ప్రపంచ ఆరోగ్య దినం సందర్భంగా కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని గోపవరంలో డాక్టర్ హనీఫ్‌బాబా ఆధ్వర్యంలో వైద్యాధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. నడక, యోగా ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, సూపర్‌వైజర్ వరప్రసాద్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత ఆదిచెన్నకేశవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. రథోత్సవంలో ఆలయ కమిటీ వారు భక్తుల సౌకర్యార్థం తాగునీటి వసతి, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. అనంతరం భక్తుల దర్శనం కోసం స్వామివారిని రథంపై నుంచి కిందకు దించి గ్రామోత్సవం నిర్వహించారు.

బండలాగుడు పోటీలు

పోటీలను మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతిని చియ్యపాడు గ్రామానికి చెందిన అనూషరాణి వృషభాలు కైవసం చేసుకోగా వీరికి రూ.40,116లు, ద్వితీయ బహుమతిని గోపవరం మండలానికి చెందిన నెమలయ్య వృషభాలు రూ.20,116లు, తృతీయ బహుమతిని నంధ్యాల జిల్లా రోళ్ళపాడు గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి వృషభాలు రూ.10,116లు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రంగారెడ్డి, నిర్వాహకులు సానపురెడ్డి మనోహర్‌రెడ్డి, ఆలయ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రకటించాలి

ప్రొద్దుటూరు : పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు యాదవ్ తెలిపారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎస్టీఎఫ్ ముందుంటుందన్నారు.

మున్సిపల్ సర్వీసు రూల్స్‌లో ఉపాధ్యాయులకు అన్యాయం జరగకుండా పదోన్నతులు, బదిలీలు జరపాలని, గురుకుల, కస్తూర్బా పాఠశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ఉద్యోగులకు పదవీవిరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి గంగా రామ్మోహన్, ప్రొద్దుటూరు పట్టణ గౌరవాధ్యక్షుడు హరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.